# స్కాలర్‌షిప్ దరఖాస్తు ప్రక్రియలో మార్పులు



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు ప్రక్రియను మార్చినట్లు జిల్లా ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి ఎం.జయపాల్ రెడ్డి తెలిపారు. కొత్త విధానం ప్రకారం మూడు దశల్లో దరఖాస్తు నమోదు ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. తొలుత డెమో అథెంటికేషన్ ఉంటుందని, అది పూర్తి కాకపోతే దరఖాస్తు ప్రక్రియ ఆగిపోతుందని తెలిపారు. పదో తరగతి మెమో ప్రకారం ఆధార్ కార్డులో పేరును అప్డేట్ చేయించడానికి విద్యార్థులు మీ సేవ కేంద్రానికి వెళ్లాలని, అప్పుడు ఈ పాస్ ఐడీ వస్తుందని వివరించారు. అనంతరం ఆధార్ బయోమెట్రిక్ లేదా ఐఆర్ఐఎస్‌ను మీ సేవలో సమర్పించాలని సూచించారు. విద్యార్థులు దరఖాస్తు పత్రాన్ని నింపిన తర్వాత రిజిస్ట్రేషన్ పూర్తవుతుందని, అనంతరం ఫామ్‌ను ప్రింట్ తీసుకొని.. కాలేజీలో సమర్పించాలని తెలిపారు. ఉపకార వేతనాల కోసం ఈ పాస్ వెబ్‌సైట్ http://telangana epass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | YADADRI BHUVANAGIRI


# రైతు భరోసా లేనట్టేనా?

## వానకాలం సీజన్ ముగిసినా పట్టని సర్కారు

- రుణమాఫీ పేరుతో రైతు భరోసాకు ఎసరు
- అడ్రస్ లేని మంత్రుల కమిటీ నివేదిక
- కమిటీలు, డిజిటల్ సర్వే పేర్లతో కాలయాపన
- ఉమ్మడి జిల్లా రైతులకు అందాల్సిన భరోసా రూ.2వేల కోట్లు
- 11 సీజన్లలో రూ.11,700 ఇచ్చిన కేసీఆర్ ప్రభుత్వం
- పెట్టుబడులకు రైతాంగం తీవ్ర ఇబ్బందులు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో గొప్ప గొప్ప పథకాలు తెస్తామని పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు... అధికారంలోకి వచ్చాక కొత్త గొప్ప పథకాలేమో గానీ ఉన్న పథకాలను ఎలా ఊడగట్టాలో ఆలోచిస్తున్నట్లున్నారు. ముఖ్యంగా రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తున్నది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతు భరోసా, రుణ మాఫీ, సాగు నీరు, కరెంటు సరఫరా వంటి పథకాలపై కేసీఆర్ సర్కార్ నాటి చిత్తశుద్ధి.. కాంగ్రెస్ పాలనలో కరువైంది. అధికారంలోకి రాగానే ఎకరాకు 7,500 రూపాయల యాసంగిలో రైతు భరోసా ఇస్తామని ప్రకటించి తీరా రూ.5వేలతోనే సరిపెట్టింది. వానకాలంలో ఇవ్వాల్సిన రైతు భరోసా నేటికీ అడ్రస్ లేదు. రైతు భరోసా ఇవ్వాల్సిన సమయంలో లేని గొప్పలకు పోయి ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామంటూ అభాసు పాలైంది. అటూ పూర్తిగా రుణమాఫీ గాక, ఇటూ సాగు ఆరంభంలో రైతు భరోసా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో వానకాలంలో పెట్టుబడి సాయంగా అందాల్సిన రూ.2వేల కోట్లు నేటికీ ఉమ్మడి జిల్లా రైతాంగానికి అందలేదు.

సమైక్య రాష్ట్రంలో కునారిల్లిన వ్యవసాయాన్ని గాడిలో పెట్టేందుకు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అప్పటి సీఎం కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి 24 గంటల ఉచిత విద్యుత్‌కు శ్రీకారం చుట్టారు. పంటల సాగులో కీలకమైన పెట్టుబడికి సాయంగా రైతుబంధును తీసుకొచ్చారు. 2018 వానకాలం సీజన్‌లో తొలుత ఎకరానికి రూ.4వేల చొప్పున, తర్వాత యాసంగి నుంచి ఎకరానికి రూ.5వేల చొప్పున.. ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10 వేల రూపాయల సాయాన్ని అందిస్తూ వచ్చారు. అప్పటి నుంచి కేసీఆర్ అధికారంలో ఉన్నన్నాళ్లు రైతుబంధుకు బ్రేక్ పడలేదు. సీజన్ ప్రారంభం అవుతుందంటే చాలూ పెట్టుబడికి ఇబ్బందులు లేకుండా నేరుగా రైతుల ఖాతాల్లోకే నగదు బదిలీ చేసేవారు. ఇలా వానకాలంలో జూన్, జూలై నెలల్లో, యాసంగిలో నవంబర్, డిసెంబర్ నెలల్లో క్రమం తప్పకుండా రైతుబంధు డబ్బు ఒక్క పైసా లంచం లేకుండా రైతులకే నేరుగా చెందాయి.

సీజన్ సీజన్‌కు కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులకు సైతం పెట్టుబడి అందజేశారు.

### రూ.2వేల కోట్ల భరోసాకు ఎగనామం

తాము అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.7,500 చొప్పున రైతు భరోసా ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో సీజన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు రూ.2వేల కోట్ల వరకు పెట్టుబడి సాయంగా అందాల్సి ఉంది. కేసీఆర్ సర్కార్‌లో 11 లక్షల మంది రైతులకు ఒక్కో సీజన్‌లో రూ.1,300 కోట్ల వరకు రైతు బంధు డబ్బు అందేది. ప్రస్తుతం ఎకరాకు రూ.7,500 రైతు భరోసాగా అందజేస్తే.. మరో 50శాతం అదనంగా లబ్ధి చేకూరాల్సి ఉంది. కానీ నేటికీ దీనిపై స్పష్టత లేకపోవడం వల్ల వానకాలంలో రైతుభరోసాగా అందాల్సిన రూ.2వేల కోట్లకు రేవంత్‌రెడ్డి సర్కార్ ఎగనామం పెట్టినట్లేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కౌలు రైతులు కూడా కాంగ్రెస్ సర్కార్‌పై ఈ సీజన్ నుంచే ఆశలు పెట్టుకున్నారు. తమకు కూడా ఎకరాకు రూ.7,500 వస్తాయని భావించారు. వీరి ఆశలు కూడా అడియాశలే అవుతున్నాయి.



### కాలయాపనకే కాంగ్రెస్ పెద్దపీట

ఈ ఏడాది ఆరంభంలో ఇవ్వాల్సిన యాసంగి రైతు భరోసా మొత్తాన్ని కాంగ్రెస్ పెంచలేకపోయింది. కేసీఆర్ సర్కారు ఇచ్చినట్లుగానే రూ.5వేలను అష్టకష్టాల మీద ఇచ్చి చేతులు దులుపుకొన్నది. వానకాలంలోనైనా ఎకరాకు రూ.7,500 రైతుభరోసా అందుతుందని రైతులు ఆశించారు. కానీ, కాంగ్రెస్ సర్కార్ మొండిచేయ్యి చూపుతున్నది. రైతుబంధులో అనర్హులకు పెట్టుబడి సాయం అందుతున్నటూ దాన్ని ప్రక్షాళన చేసేందుకు మంత్రులతో కూడిన కమిటీ వేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మంత్రుల కమిటీ రైతులు, మేధావుల అభిప్రాయల సేకరణ పేరుతో హెలికాప్టర్ వేసుకుని చక్కర్లు కొట్టింది. ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు, తమ అనుకూల రైతులతో చర్చించారు. రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. 15 రోజుల్లో నివేదిక ఇవ్వగానే అసెంబ్లీలో చర్చించి రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామని చెప్తే రైతులు నిజమేనని నమ్మారు. మంత్రులు పర్యటించి వెళ్లి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ నివేదిక లేదూ... అసెంబ్లీలో చర్చ లేదు. ఇప్పుడు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత, ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తున్న నేపథ్యంలో ప్రస్తుతం సాగు చేసిన పంటలకే రైతుభరోసా ఇస్తామంటూ మరోకొత్త డ్రామాకు తెరలేపారు. పంటల సాగుపై లెక్కలు తేల్చేందుకు డిజిటల్ క్రాప్ సర్వేకు ఆదేశాలిచ్చారు. కానీ దీనికి క్షేత్రస్థాయిలోని వ్యవసాయ విస్తరణ అధికారులు సహాయ నిరాకరణ చేస్తుండడంతో ఎప్పుడు పూర్తవుతుందో, ఎప్పుడు రైతుభరోసా ఇస్తారో అన్నది తేలడం లేదు. ఏలా వీలైతే అలా కాలయాపన చేసేందుకే కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### రూ.11,700 కోట్లు ఇచ్చిన కేసీఆర్

2018 వానకాలం సీజన్ నుంచి రైతు బంధు పథకానికి శ్రీకారం చుట్టిన నాటి ముఖ్యమంత్రి కేసీఆర్.. వరుసగా మొత్తం 11 సీజన్లల్లో క్రమం తప్పకుండా కచ్చితంగా అందజేస్తూ వచ్చారు. 2018 వానకాలం సీజన్ నుంచి మొదలుపెట్టి ఎకరానికి ఐదు వేల చొప్పున ఏడాదిలో రెండు సీజన్లకు కలిపి 10వేల రూపాయల సాయాన్ని అందించారు. అప్పటి నుంచి 2023 వానకాలం సీజన్ వరకు ఎన్నడూ రైతు బంధు ఆగలేదు. మొత్తం వరసగా 11 సార్లు రైతుబంధు ద్వారా ఉమ్మడి జిల్లా రైతులకు రూ.11,700 కోట్ల రూపాయల నగదును కేసీఆర్ సర్కార్ పంపిణీ చేయడం విశేషం. ఇన్ని కోట్ల రూపాయల్లో ఒక్క రూపాయి పక్కదారి పట్టకుండా ప్రతి పైసా నేరుగా రైతులకే చెందేలా అత్యంత పకడ్బందీగా పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసింది. ఒక్క రూపాయి కూడా ఎవ్వరికీ లంచం ఇవ్వకుండా నేరుగా రైతులకే చెందాయంటే అందుకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధే కారణం. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి గద్దెనెక్కాక మోసం చేస్తున్నదని రైతులు, రైతుసంఘాల నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు.

# యాదాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

## ఏర్పాటుకు సర్కారు ముమ్మర కసరత్తు

- 10 మండలాలతో ఉన్నతాధికారుల ప్రతిపాదనలు
- హెచ్ఎండీఏలోకి తుర్కపల్లి, సంస్థాన్‌నారాయణపురం మండలాలు
- ఏడు మండలాలకు చేరనున్న హెచ్ఎండీఏ పరిధి
- వైటీడీఏ ఏం చేయాలనే దానిపై తర్జన భర్జన


యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : జిల్లా నైసర్గిక స్వరూప పరిధిలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పుడున్న మండలాలు కొత్త పరిధిలోకి చేరనున్నాయి. ఇప్పటికే జిల్లాలో హెచ్ఎండీఏ, వైటీడీఏ కొనసాగుతుండగా, కొత్తగా యాదాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైయూడీఏ) ఏర్పాటుకానుంది. ఈ మేరకు ఉన్నతాధికారులు పలు అంశాలతో కూడిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

జిల్లాలో 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వాటిలో కొన్ని హెచ్ఎండీఏ, వైటీడీఏ పరిధిలో ఉన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధికారులు ముమ్మర కసరత్తు చేశారు. హెచ్ఎండీఏలో ఎన్ని మండలాలు ఉన్నాయి? ఇంకా ఎన్ని కలుపాలి?

### ప్రతిపాదనలు ఇలా..

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు యాదాద్రి భువనగిరి జిల్లా దగ్గరలో ఉంది. కొంత ప్రాంతం మినహా అధిక శాతం అర్బన్ ఏరియా కలిగి ఉంది. హెచ్ఎండీఏ మినహా మిగతా మండలాలతో ఈ అథారిటీ ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. దీని పరిధిలోకి రాజాపేట, ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూరు (ఎం), మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు, రామన్నపేట మండలాలతో వైయూడీఏ ఏర్పాటుచేసేందుకు దాదాపు నిర్ణయం తీసుకున్నారు. వలిగొండ మండలంలోని 5 గ్రామాలు ట్రిపుల్ ఆర్‌లో పోతుండడంతో ఏం చేయాలనే ఆలోచనలో ఉన్నారు. అంతిమంగా వైయూడీఏలో కలపనున్నట్లు తెలుస్తున్నది. ఇక ఆలేరు, మోత్కూరు మున్సిపాలిటీలు కూడా దీని పరిధిలోనే ఉండనున్నాయి.

కొత్తగా ఏర్పాటయ్యే యాదాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలోకి ఏయే మండలాలు ఉంటే ఉపయోగకరంగా ఉంటుంది? వైటీడీఏను అలాగే ఉంచాలా.. లేకపోతే వైయూడీఏలో విలీనం చేయాలా? ఇప్పటికే ఉన్న వైటీడీఏనే కొనసాగించి.. హెచ్ఎండీఏ మండలాలు మినహా అన్నీ అందులోనే కలపాలా? అనే విషయాలపై కూలంకశంగా కసరత్తు చేశారు. ఈ మేరకు మ్యాప్‌లతో కూడిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం అంతిమ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.




### వైటీడీఏ పరిస్థితేంటి?

యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వైటీడీఏ) ఇప్పటికే కొనసాగుతున్నది. దీని పరిధిలో యాదగిరిగుట్ట మండలంతోపాటు భువనగిరి మండలంలోని కొన్ని గ్రామాలు ఉన్నాయి. వైటీడీఏపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే వైయూడీఏ బదులు.. ఇప్పటికే ఉన్న వైటీడీఏనే సాగిస్తే ఎలా ఉంటుందనే ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఒకవేళ వైటీడీఏను కాదని వైయూడీఏ వైపు మొగ్గు చూపితే యాదగిరిగుట్ట మండలంతోపాటు, మున్సిపాలిటీ కూడా యాదాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో కలిపే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తున్నది.

### హెచ్ఎండీఏలోకి తుర్కపల్లి, నారాయణపురం

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధి ఇప్పటికే జిల్లాలోని ఐదు మండలాల్లో విస్తరించి ఉంది. భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మండలాలతోపాటు భువనగిరి, పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీలు కూడా ఉన్నాయి. కొత్తగా మరో రెండు మండలాలు అందులో కలిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తుర్కపల్లి, సంస్థాన్‌నారాయణపురం మండలాలను హెచ్ఎండీఏలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు పంపించారు. హెచ్ఎండీఏలో చేర్చితే అభివృద్ధికి అధిక నిధులు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

# బాలాత్రిపురసుందరిగా పర్వతవర్ధినీ అమ్మవారు

- దేవీ శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట, అక్టోబర్3 : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా తొలిరోజు యాదగిరిగుట్టలోని పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో పర్వతవర్ధినీ అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఉదయం శివాలయంలోని అమ్మవారి సన్నిధిలో గణపతి పూజ, స్వస్తీవాచనం, పుణ్యాహవాచనంతో శరన్నవరాత్రోత్సవాలకు ప్రధానార్చక, ప్రధాన పురోహిత బృందం శ్రీకారం చుట్టింది. అఖండ దీపారాధన, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసనతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అంకురారోపణం, కలశ స్థాపన, చతుశ్షష్టి ఉపచార పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, శివాలయం ప్రధాన పురోహితుడు గౌరీభట్ల సత్యనారాయణశర్మ, ప్రధాన అర్చకుడు గౌరభట్ల నరసింహరాములు శర్మ పాల్గొన్నారు.



బాలా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు



కేతేపల్లిలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# రుణమాఫీ అమలులో సర్కారు విఫలం

రైతుభరోసా ఊసెత్తని కాంగ్రెస్ ప్రభుత్వం

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- కేతేపల్లి రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి, అక్టోబర్ 3 : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ చేయకపోవడాన్ని నిరసిస్తూ కేతేపల్లి మండల కేంద్రంలో పలు గ్రామాల రైతులతో కలిసి గురువారం ఆయన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయం ముందు రైతుధర్నాకు దిగారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ రుణమాఫీ కాకపోవడంతో అనేక మంది రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎంత మంది రైతులకు, ఎంత రుణం మాఫీ చేశారో కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దసరా పండుగలోపు రైతులందరికీ షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జూన్ నెలలో ఇవ్వాల్సిన రైతుభరోసా ఇంత వరకు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు.

### రేవంత్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు

సీఎం రేవంత్‌రెడ్డి నోటి దురుసుతో ప్రజలు విసుగు చెందుతున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి అన్నారు. ఎన్నికల హామీల అమలును పక్కదోవ పట్టించేందుకు బీఆర్ఎస్ నాయకులపై దాడులు, విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సీఎంను అనుసరిస్తూ మంత్రులు అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలనపై అవగాహన లేని రేవంత్‌రెడ్డి సీఎం అవడం ప్రజల దురదృష్టమన్నారు. హామీల అమలులో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసారు. ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాల్సిన పాలకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం వెంకట్‌రెడ్డి, చిముట వెంకన్నయాదవ్, నాయకులు బి.శ్రీనివాస్‌యాదవ్, కె.ప్రదీప్‌రెడ్డి, బంటు మహేందర్, ఆర్.శ్రీనివాస్‌గౌడ్, బి.సురేశ్, కె.శ్రవణ్, జి.సత్యనారాయణగౌడ్, వి.చేతన్ పాల్గొన్నారు.



బీబీనగర్ మండలం మహదేవ్‌పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే జెండగే

# డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ప్రతి ఇంటికీ వెళ్లి అన్ని వివరాలు సేకరించాలి
- కలెక్టర్ హనుమంతు కే జెండగే
- మహాదేవ్‌పూర్‌లో సర్వే ఆకస్మిక తనిఖీ

బీబీనగర్, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే జెండగే అధికారులను ఆదేశించారు. బీబీనగర్ మండలంలోని మహాదేవ్‌పూర్ గ్రామంలో గురువారం జరుగుతున్న ప్రారంభమైన కుటుంబ సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫ్యామిలీ డేటా బేస్ ఆధారంగా అధికారులు నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, కొత్తగా నమోదు కావాల్సిన పేర్లు ఉంటే చేర్చాలని సూచించారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా సమగ్ర వివరాలను సేకరించాలన్నారు.నిర్ణీత సమయంలోపు పైలెట్ ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట భువనగిరి ఆర్డీఓ అమరేందర్, ఎంపీడీఓ శ్రీనివాస్, తాసీల్దార్ శ్రీధర్ ఉన్నారు.



చౌటుప్పల్ నుంచి బస్సులో ధర్నాకు తరలివెళ్తున్న ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులు

# ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల చలో హైదరాబాద్

- పెద్దఎత్తున తరలివెళ్లిన రైతులు

చౌటుప్పల్, అక్టోబర్ 3 : రీజనల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు, నిర్వాసితులు రాజధాని హైదరాబాద్‌లో నిరసన తెలిపేందుకు గురువారం పెద్దఎత్తున తరలివెళ్లారు. భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరా పార్కు వద్ద ధర్నాకు దిగారు. భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి సుమారు వెయ్యిమందికి వరకు రైతు కుటుంబాలతో కలిసి పాల్గొన్నారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చి భూ నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భూములు తీసుకుంటే బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర చెల్లించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఓఆర్ఆర్ నుంచి నాలుగు ప్రధాన రహదారులకు 40 కిలోమీటర్ల దూరంలో జంక్షన్ ఏర్పాటు చేసూ చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో మాత్రం 28 కిలోమీటర్లకు కుదించడం ఏంటంటూ నిరసన తెలిపారు.

# చౌటుప్పల్ సీహెచ్‌సీకి కాయకల్ప అవార్డు

చౌటుప్పల్, అక్టోబర్ 3 : చౌటుప్పల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కాయకల్ప అవార్డుకు ఎంపికైంది. ప్రజారోగ్య సంరక్షణ, సౌకర్యాల కల్పన, పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ నియంత్రణ వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని స్టేట్ క్వాలిటీ టీమ్ అవార్డుకు ఎంపిక చేసింది. గతంలోనూ ఈ దవాఖానకు కాయకల్ప పురస్కారం దక్కింది. అవార్డుకు ఎంపికవడంతో దవాఖాన వైద్యులు, సిబ్బంది సంతోషం వ్యక్తంచేశారు.




కాయకల్ప అవార్డుకు ఎంపికవడంపై సంతోషం వ్యక్తం చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

# రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దు

- అఖిలపక్ష సమావేశం తీర్మానం

రామన్నపేట, అక్టోబర్ 3 : రామన్నపేట మండల కేంద్రంలో అదానీ కంపెనీ ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా అఖిలపక్ష నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఫ్యాక్టరీ ఏర్పాటును నిరసిస్తూ గురవారం మండల కేంద్రంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ భవిష్యత్ తరాలు బాగుండాలంటే కాలుష్యం వెదజల్లే సిమెంట్ పరిశ్రమను మండల ప్రజలు వ్యతిరేకించాలన్నారు. అఖిల పక్షం ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. 1400 కోట్ల రూపాయలతో నిర్మించే పరిశ్రమలో 180 మందికి మాత్రమే ఉపాధి దొరికితే ఎవరి ప్రయోజనమన్నారు. అనంతరం ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. జెల్లెల పెంటయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కార్యదర్శి పోశబోయిన మల్లేశం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, బీజేపీ మండలాధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఎండీ జమీరుద్దీన్, నాయకులు గోదాసు పృథ్వీరాజ్, ఎండీ రేహాన్, అప్పం లక్ష్మీనర్సు, బండ శ్రీనివాస్‌రెడ్డి, పున్న వెంకటేశం, ఎండీ నాసర్, సాల్వేరు లింగం, మీర్జా ఫజల్‌బేగ్, రాపోలు రాజశేఖర్ పాల్గొన్నారు.